నమస్కారములు.

ఈ వచ్చే అక్షయ తృతీయ నైమిత్తిక తిథి [ 21/4/2015 , మంగళ వారం ] సందర్భంగా, గురువర్యులు ఇంతకు ముందు చెప్పిన విహిత కర్మలను ఓ సారి పున:శ్చరణ చేసుకునే ముందు మిమ్మల్ని తలుచుకుంటున్నాను.

అక్షయ తృతీయ నాడు, మనం చేపట్టిన ఏ కార్య ఫలమైనా, [ అది పుణ్యం కావచ్చు; లేదా పాపం కావచ్చు.] అక్షయంగా, నిరంతరం, జన్మలతో సంబంధం లేకుండా, మన వెంట వస్తూనే ఉంటుంది.

పుణ్య కర్మలన్నీ విహితమైనవే. అందునా, ఆ రోజు ఓ కొత్త కుండలో గానీ, కూజాలో గానీ, మంచి నీరు పోసి, దాహార్తులకు శ్రద్ధతో సమర్పిస్తే, ఎన్ని జన్మల లోనూ, మన జీవుడికి దాహంతో గొంతు ఎండి పోయే పరిస్థితి రాదు.
అతిధులకు,
అభ్యాగతులకు, పెరుగన్నంతో కూడిన భోజనం సమర్పిస్తే, ఏ రోజూ ఆకలితో
మనం
అలమటించవలసిన రోజు రాదు. వస్త్రదానం వల్ల తదనుగుణ ఫలితం లభిస్తుంది.

అర్హులకు స్వయంపాకం, దక్షిణ, తాంబూలాదులు సమర్పించుకుంటే, మన ఉత్తర జన్మలలో, వాటికి లోటు రాదు.

గొడుగులు, చెప్పులు, విసన కర్రల లాటివి దానం చేసుకోవచ్చు.

ముఖ్యంగా ఆ రోజు నిషిద్ధ కర్మల జోలికి వెళ్ళక పోవడం ఎంతో శ్రేయస్కరం.

గురువుగారి, తత్సంబంధిత అనుగ్రహ భాషణాన్ని ఓ సారి పరిశీలిస్తే,

భాగవతం ప్రధమ స్కంధం ప్రకారం, పరీక్షిన్మహా రాజు కలి పురుషుడికి ఐదు
నివాస
స్థానాలను కేటాయించాడు. అవి:

జూదం, మద్య పానం, స్త్రీలు, ప్రాణి వధ, బంగారం. వీటితో పాటు కలి కి లభించినవి ఇంకో ఐదు;
అసత్యం,గర్వం, కామం, హింస, వైరం. జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆ పైన ఉన్న ఐదిటికీ ఇవి అనుషంగికాలు.
ఆ పై ఐదిటినీ ఇవి నీడలా వెన్నంటే ఉంటాయి.

అక్షయ తృతీయ రోజు ఎవరైనా, ఈ ఐదిటిలో దేని జోలికి వెళ్ళినా, కలి పురుషుడి దుష్ప్రభావం
అక్షయంగా వెంటాడుతూనే ఉంటుంది.

అందుకే, నాకు నేను " తస్మాత్ జాగ్రత్త " అని చెప్పుకుంటూ, ఆ రోజు అన్నీ మంచి పనులు, శుభ
సంకల్పాలే నాతో చేయించమని ఆ ఈశ్వరుణ్ణి వేడుకుంటున్నాను.